క్లుప్తంగా

రథసప్తమి వేడుకలకు ముస్తాబు



ముస్తాబైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది స్వామి వారికి 7 రకాల వాహన సేవలను నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా ఉదయం 6-30 గంటలకు సూర్యప్రభ వాహనం, 7-45 గంటలకు శేష వాహనం, 9-30 గంటలకు హనుమంతు వాహనం, 11 గంటల నుంచి గరుడ వాహన సేవలు నిర్వహించి సాయంత్రం 5 గంటలకు అశ్వవాహనం, 6-30 గంటలకు గజ వాహనం, 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి తెలిపారు. అలాగే మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భూ సేకరణ రికార్డుల పరిశీలన



భూ సేకరణకు సంబంధించి రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గణేష్ కుమార్

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు, వెలవలి, రాజుపాళెం, టంగుటూరు, అర్కటవేముల, దద్దనాల, పగిడాల, వెల్లాల గ్రామాల మీదుగా వెళ్లే జాతీయ రహదారి 440కి సంబంధించిన భూ సేకరణను గురువారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులను తహసీల్దార్ విజయశ్రీ జేసీకి చూపించారు. జాతీయ రహదారికి అవసరమయ్యే భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తీసుకుంటామని, ప్రతి రైతుకు న్యాయం చేస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న శెట్టిపల్లె నాగిరెడ్డి

చాపాడు : మండలంలోని పెద్దగురవళూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి బాల వేమారెడ్డి రెండు రోజుల క్రితం చాపాడులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి నంద్యాలలోని ఆసుపత్రికి వెళ్లి బాల వేమారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట చాపాడు ఎంపీపీ లక్షుమయ్య, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, కర్నాటి చంద్రమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌యాదవ్, నవీన్ హాజరయ్యారు.

గుడిసెలు కూల్చివేత



గుడిసెలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోపవరం : మండలంలోని పి.పి.కుంట జగనన్న కాలనీ వద్ద గోపవరం రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1557 లోని ప్రభుత్వ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో పేదల చేత వేయించిన గుడిసెలను గురువారం తహసీల్దారు రోశయ్య ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పేదలను రెచ్చగొట్టి ప్రభుత్వ భూమిలో సీపీఐ జెండాలు నాటి గుడిసెలు వేయిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అనేకసార్లు హెచ్చరించినా యథేచ్ఛగా గుడిసెలు వేయిస్తుండటంతో రెవెన్యూ, పోలీసులు రంగంలోకి దిగి సీపీఐ నాయకులు ఖాదర్‌బాషా, పెంచలయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ సిబ్బంది గుడిసెలను కూలివేయడంతో పాటు సీపీఐ జెండాలను కూడా తీసేశారు. కాగా గుడిసెలు వేసిన వారిలో స్థానికేతరులు అధికంగా ఉండటంతో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రభుత్వం స్థలాలను మంజూరు చేస్తుందని, చెప్పుడు మాటలు ఎవరూ కూడా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రవికుమార్ హెచ్చరించారు. ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- రేకలకుంటలో విజయవంతమైన యాదవుల ఆత్మీయ సమ్మేళనం
- రూ.1.25కోట్లలో రాణిబావి గంగమ్మ ఆలయ పునఃనిర్మాణం
- భూమిపూజ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



రాణిబావి గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన యాదవులు



యాదవ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి జగనన్న పెద్దపీట వేశారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంటలో గురువారం ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైంది. అంతకు ముందు రేకలకుంటలో పురాతనమైన రాణిబావి గంగమ్మ దేవత ఆలయం రూ.1.25 కోట్ల వ్యయంతో పునఃనిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలను బ్యాక్ వర్డ్ క్లాస్ గా కాకుండా బ్యాక్ బోన్ క్లాస్ గా ముఖ్యమంత్రి భావిస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనమే రమేష్‌యాదవ్‌ను ఎమ్మెల్సీ చేయడమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సర్పంచ్ నుంచి పార్లమెంట్ సభ్యుల వరకూ ఆ వర్గాలకు చెందిన వారికే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి క్యాబినెట్‌లో 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారన్నారు. ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపిన విషయాన్ని గుర్తుచేశారు. ఏలూరు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థులుగా బీసీలనే ఖరారు చేశారని వివరించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలన్నదే జగనన్న ధ్యేయమన్నారు. కడపలో రూ.5.50 కోట్లతో బీసీ భవన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. యాదవ భవన్‌కు 2 ఎకరాల స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి చేసిన ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ కోరారు.

బీసీలకు మేలు చేసింది వైఎస్ జగనే : సురేష్ బాబు

బీసీలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధ్యక్షులు కె.సురేష్‌బాబు అన్నారు. బీసీలను చట్ట సభలకు పంపిన ఘనత ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. బీసీలలో యాదవులను అభివృద్ధిలోకి తీసుకురావాలని ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలో ముగ్గురిని ఎమ్మెల్యేలుగా చేయగా వారి కంటే మిన్నగా వైఎస్ జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారని.. అందులో ఇద్దరు యాదవులు ఉన్నారని తెలిపారు. చంద్రబాబు కేవలం తన సామాజిక వర్గానికే రాజ్యసభ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. టీడీపీలో బీసీలకు ప్రాధాన్యత లేదన్నారు. యాదవులకు జిల్లాలో ఎన్నో పదవులు ఇచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో కులాలకు మతాలకు పార్టీలకతీతంగా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసగించి ఇప్పుడు మళ్లీ భవిష్యత్తు గ్యారంటీ అంటూ ప్రజల వద్దకు వస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని దీవించాలని.. 175కు 175 సీట్లు వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

టీడీపీ పెత్తందార్ల పార్టీ : ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

టీడీపీ పెత్తందార్ల పార్టీ అని ఆ పార్టీకి అధికారం కట్టబెడితే రాష్ట్రంలో పెత్తందార్ల పాలన తప్పదని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. చంద్రబాబు పెత్తందార్లకే పెద్ద పెద్ద పదవులు ఇచ్చారని రాష్ట్రంలో 3.5 శాతం ఉన్న కమ్మ కులానికే స్పీకర్, మంత్రి పదవులు ఇచ్చారని ఆరోపించారు. వైఎస్ జగన్ అన్ని కులాలను, మతాలను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. యాదవులను అభివృద్ధిలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్న రమేష్‌యాదవ్‌ను పిలిచి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని తెలిపారు.

వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటాను : ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

సమ్మేళన సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తనకు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా జిల్లా చరిత్రలోనే ఒక యాదవ్ చట్ట సభకు వెళ్లేందుకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మొత్తంగా వైఎస్ కుటుంబానికి తాను ఊపిరి ఉన్నంత వరకూ రుణపడి ఉంటానని అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న ప్రభుత్వంలోనే పదవులు దక్కాయన్నారు. ఇవ్వలేదన్నారు. బాలయ్య అనే వ్యక్తిని జడ్పీ వైస్ చైర్మన్‌ను చేయడం గొప్ప విషయమన్నారు. యాదవులంతా ఏకతాటిపై సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలబడి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

■ సమ్మేళనంలో మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు శివ యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్, కడప మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త బంగారు నాగయ్య యాదవ్, చాపాడు ఎంపీపీ లక్షుమయ్య యాదవ్, దువ్వూరు జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ తదితరులు మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా యాదవ సంఘం నాయకులు, బీసీ సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపల్, సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్‌జీవోకాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంత మంది మున్సిపల్ సిబ్బంది, కొన్ని సచివాలయాల సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, వారంతా తమ పద్ధతి మార్చుకుని అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో ప్రతి వార్డులో ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. అలాగే బద్వేలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరురోడ్డులోని పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకును త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 32వ వార్డులో అదనపు పైపులైను అవసరం ఉందని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కౌన్సిలర్ చెన్నయ్య సమావేశం దృష్టికి తీసుకురాగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డీఈ తెలిపారు. 24వ వార్డులో డ్రైనేజీ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా స్పందించడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ రవితేజ సమావేశం దృష్టికి తీసుకురాగా తక్షణమే సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. 7వ వార్డులోని రజకవీధి పాఠశాల వద్ద శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను తొలగించాలని ఆ వార్డు కౌన్సిలర్ సమత సమావేశం దృష్టికి తీసుకురాగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. 2వ వార్డులోని శీలంవారిపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో జాప్యం జరుగుతోందని ఆ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకురాగా.. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ తెలిపారు. 3వ వార్డులోని వల్లెరవారిపల్లెలో కోతుల బెడద అధికంగా ఉందని ఆ వార్డు కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య సమావేశం దృష్టికి తీసుకురాగా.. కోతులను తరలించేందుకు చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సమాధానమిచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డీఈ సుమన్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన నిధులను బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని గుంతచీపాడు గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు జయసింహ భార్య దస్తగిరమ్మకు గైనకాలజీ సంబంధిత వైద్యం కింద రూ.6 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. బుధవారం బాధితురాలి కుటుంబీకులకు ఎమ్మెల్యే చెక్కును అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కింద లేని వ్యాధులు, ఇతర చికిత్సలకు ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరవుతుందన్నారు. ఇలా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో చియ్యపాడు మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : అనారోగ్యంతో బాధపడుతున్న బాలునికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన కె.షాహుల్ అహ్మద్ అనే బాలుడు నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. సంబంధిత చెక్కును స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జడ్జీ ఖాజా మైనుద్దీన్

చాపాడు : సమాజంలో ఉండే ప్రజలందరూ అందుబాటులో ఉన్న న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జీ ఖాజా మైనుద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని విజయనగరం గ్రామంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా అన్యాయం జరిగినప్పుడు న్యాయం పొందాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకూ ప్రతి ఒక్కరికీ చట్టాలు అందుబాటులో ఉంటాయన్నారు. చట్టానికి అందరూ సమానులేనని ప్రతి ఒక్కరూ చట్టాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. పేదల కోసం ప్రభుత్వ న్యాయవాదులు ఉంటారని వారు అందించే సేవల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నగురువళూరులోని బీసీ హాస్టల్‌ను విజిట్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు యామిని, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, పీపీ జ్వాలా నరసింహ శర్మ, సీనియర్ న్యాయవాదులు జేకే చారీ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చూడండి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు బాషా

పోరుమామిళ్ల : వేసవిలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడకుండా చూడాలని జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైఎస్ ఎంపీపీ సీఎం బాషా అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరిలోనే ఎండలు అధికంగా ఉన్నాయని తాగునీటి చేతిపంపులకు మరమ్మతులు చేయాలన్నారు. ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలను ప్రవేశపెట్టారని వాటిని ప్రజలకు చేరవేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రైతులు వ్యవసాయబోర్లకు విద్యుత్ మోటార్లు అమర్చుకునేందుకు ఎన్‌ఓసీల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తహసీల్దారు రైతులు ఇబ్బందులు పడకుండా ఎన్‌ఓసీలు త్వరగా ఇవ్వాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, జరుగుతున్న పనుల గురించి వివరించారు. వైస్ ఎంపీపీ-2 రాజశేఖర్, సింగల్‌విండో అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దారు శిరీష మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఉరకలేసే ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం ప్రారంభం

- వేలాది మంది కార్యకర్తలు హాజరు
- ఆలయాల్లో పూజలు చేసిన ఎమ్మెల్యే రాచమల్లు దంపతులు



ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



అమ్మవారిశాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు దంపతులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల ప్రచారం ఉరకలేసే ఉత్సాహంతో ప్రారంభమైంది. ఉమ్మడి కడప జిల్లాలో తొలి మారు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

■ ఎమ్మెల్యే రాచమల్లు సూచనతో నియోజకవర్గం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల నుంచి కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. సభకు స్వచ్ఛందంగా హాజరై పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉదయం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి, సోదరుని కుమారుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీరు రామేశ్వరంలోని తన మేనమామ పాతకోట విజయమునిరెడ్డి సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి నివాళి అర్పించారు. తర్వాత మునెయ్యస్వామి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి వారు పూజలు చేశారు. అనంతరం ఎన్నికల సమరశంఖాన్ని పూరించారు.

■ రామేశ్వరం నాలుగు రోడ్ల కూడలిలో పార్టీ అభిమానులు ఎమ్మెల్యే, ఎంపీకి ప్రత్యేకంగా తయారు చేయించిన గజమాలను క్రేన్ సహాయంతో వేశారు. రామేశ్వరం నుంచి వన్‌టౌన్ సర్కిల్ వరకు సాగిన ఈ ప్రచార కార్యక్రమానికి 10వేలకు మందికిపైగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరయ్యారు.

■ కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, ప్రొద్దుటూరు రాజుపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

నేడు బొల్లవరంలో ఎన్నికల ప్రచారం

ప్రొద్దుటూరు : స్థానిక ఒకటో వార్డు బొల్లవరంలోని మహర్షి విద్యామందిరం వద్ద నుంచి శుక్రవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

నేడు బద్వేలుకు సైన్స్ కళాజాత

బద్వేలు అర్బన్ : జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన సైన్స్ కళాజాత శుక్రవారం బద్వేలుకు చేరుకుంటుందని, ఇందులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రదర్శనలు నిర్వహిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, జేవీవీ జిల్లా గౌరవ సలహాదారుడు రామసుబ్బారెడ్డిలు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న శ్రీకాకుళంలో ప్రారంభమైన సైన్స్ కళాజాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తోందని తెలిపారు.

నేడు వలంటీర్లకు సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం ఉదయం 10.30గంటలకు వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అందిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

19న ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

పోరుమామిళ్ల : ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19న సోమవారం ఉదయం వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శివాజీ ఐక్యవేదిక తెలిపింది. శోభాయాత్రలో కోలాటం ఉంటుందని, శివాజీ వేషధారణలో పిల్లలు పాల్గొనాలన్నారు.

ఏ సమస్య వచ్చినా నన్ను కలవండి.. ఎంపీ



ఎంపీ, ఎమ్మెల్యే, కోఆర్డినేటర్లను సత్కరిస్తున్న విశ్వనాథ్‌రెడ్డి

పోరుమామిళ్ల : నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్యవచ్చినా నన్ను కలవాలని నియోజకవర్గ ప్రజలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భరోసా కల్పించారు. కాశినాయన మాజీ మండల అధ్యక్షుడు నల్లేరు విశ్వనాథ్‌రెడ్డిని నియోజకవర్గ అదనపు సమన్వయకర్తగా పార్టీ నియమించడంతో గురువారం పోరుమామిళ్లలోని ఆయన స్వగృహానికి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సురేష్‌బాబు, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు చేరుకుని ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరూ కలసి పని చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సుధ, కో ఆర్డినేటర్ సురేష్‌బాబు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అదనపు సమన్వయకర్తగా నన్ను నియమించడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న సీనియర్ ఎంవీఐ నారాయణ నాయక్

ప్రొద్దుటూరు క్రైం : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని ఎంవీఐ నారాయణ నాయక్ తెలిపారు. స్థానిక నెహ్రూరోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కాలేజీలో గురువారం రహదారి భద్రతపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లు, కార్లు నడిపే యువతీ, యువకులు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలన్నారు. లైసెన్స్ కలిగి ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపడం అత్యంత ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అనేవి మన రక్షణ కోసం ఉన్నాయన్నారు. పోలీసు, రవాణాశాఖ అధికారుల సూచనలు పాటించడం శ్రేయస్కరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ మురళీధర్, ఆర్టీసీ డిపోమేనేజర్ మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు : యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు తెలిపారు. స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజిలో గురువారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు చింతా రామ్మోహన్ రెడ్డి, సుంకర చంద్రమౌళి, అంకాల్ రెడ్డి, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ జిల్లా అధ్యక్షురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల సాగుతో పశుదాణా

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయంలో ఆకుకూరలు సాగు చేయడం వలన పశుదాణా కూడా లభ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు అన్నారు. మైదుకూరు మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటకు ముందు 18 రకాల విత్తనాలతో ప్రధాన పొలంలో విత్తనాలను వెదజల్లి 45 రోజుల లోపల భూమిని కలియదున్నాలని తెలిపారు. దాని వలన భూమి సారవంతం కావడంతోపాటు ప్రధాన పంటకు పోషకాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆదే విధంగా 45 రోజుల లోపల ఆకుకూరలు పొందడంతోపాటు మిగిలిన వ్యర్థాలను పశువుల దాణాగా ఉపయోగించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.